www.methukuseema news

Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :10 | గురువారం | 28 నవంబర్ 2024

Published from : Hyderabad,Sanagareddy

పేజీలు :04 వేల : 5.00




## ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించే వరకు పర్యవేక్షణ తమదేనన్న హైకోర్టు



- ఇప్పటి వరకు పలు చెరువులకు నోటిఫికేషన్లు జారీ చేశామన్న హెచ్ఎండీఏ
- తదుపరి విచారణ డిసెంబర్ 30కి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించే వరకు హైదరాబాద్‌లోని చెరువుల పర్యవేక్షణ బాధ్యత తమదేనని తెలంగాణ హైకోర్టు స్పషం చేసింది. నగరంలోని అన్ని చెరువుల పర్యవేక్షణ తమదేనని తెలిపింది. రామమ్మ చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది. మరోవైపు, హెచ్ఎండీఏ పరిధిలో 3,532 చెరువులు ఉన్నాయని గత జులైలో విచారణ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. వాటికి బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని హైకోర్టు ఆదేశించింది. ఈరోజు రామమ్మ చెరువు బఫర్ జోన్‌పై విచారణ సందర్భంగా హెచ్ఎండీఏ కమిషనర్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటి వరకు 2,793 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ చేశామని, 530 చెరువులకు తుది నోటిఫికేషన్లు జారీ అయ్యాయని తెలిపారు. తదుపరి విచారణను డిసెంబర్ 30కి వాయిదా వేసింది. ఆ లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

## సర్వే చేసి సరిహద్దులు గుర్తించే వరకు

### నిర్మాణాలు వద్దు - హైడ్రా కమిషనర్

- మాదాపూర్‌లోని ఈదులకుంట చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్
- చెరువు శిఖాన్ని పూడ్చేసి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన రంగనాథ్
- చెరువులోకి నీరు వచ్చే నాలాను దారి మళ్లించినట్లు గుర్తించిన కమిషనర్



హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : ఈదులకుంటను సర్వే చేసి సరిహద్దులు గుర్తించే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈరోజు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మాదాపూర్‌లోని ఈదులకుంట చెరువును ఆయన పరిశీలించారు. ఖానామెట్ గ్రామంలో 6.5 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు శిఖాన్ని పూడ్చేసి కొంతమంది బిల్డర్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. చెరువులోకి నీరు వచ్చే నాలాను బిల్డర్లు దారి మళ్లించినట్లు గుర్తించారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అనుమతులు తీసుకున్నట్లు హైడ్రా కమిషనర్ గుర్తించారు. అక్రమంగా తీసుకున్న అనుమతులతోనే నిర్మాణాలు చేపట్టినట్లు కమిషనర్ రంగనాథ్ గుర్తించారు. ఈ క్రమంలో అక్కడ సర్వే పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## ప్రధాని మోదీని కలిసిన తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు




- మోదీని కలిసిన వారిలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్
- మోదీతో కాసేపు ముచ్చటించిన ప్రజాప్రతినిధులు
- రాజాసింగ్ భుజం తట్టిన ప్రధాని మోదీ

హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : ప్రధాని నరేంద్రమోదీని తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిశారు. వారితో పాటు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా ఉన్నారు. వారు ప్రధాని మోదీకి శాలువా కప్పి సత్కరించారు. ఎంపీలను, ఎమ్మెల్యేలను ప్రధాని ఆప్యాయంగా పలకరించారు. వారితో వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రధానిని కలిసిన వారిలో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు రాజాసింగ్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు. మోదీ ఈ సందర్భంగా రాజాసింగ్‌ను తన దగ్గరకు పిలిచి భుజం తట్టారు

## ఇథనాల్ ప్రాజెక్టు అది కేటీఆర్ తలసాని కొడుకుల పరిశ్రమే

- ఇథనాల్ పరిశ్రమకు పర్మిషన్ ఇచ్చిందే బీఆర్ఎస్ పార్టీ
- ఇప్పుడేమీ తెలియనట్లు రైతులను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం
- నిర్మల్ ప్రజలు నిజాలు తెలుసుకోవాలని టీపీసీసీ చీఫ్ విజ్ఞప్తి




హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ఇథనాల్ పరిశ్రమ కేటీఆర్ ప్రాజెక్టు అని, ఆయనతో ఉన్న సంబంధాలతోనే తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ డైరెక్టర్‌గా ఉన్న కంపెనీకి అనుమతులు ఇచ్చారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఇథనాల్ పరిశ్రమకు పర్మిషన్ ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీయేనని... ఇప్పుడు ఏమీ తెలియనట్లుగా నటిస్తూ ఆ పార్టీయే రైతులు రెచ్చగొడుతోందని విమర్శించారు.బుధవారం నాడు గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... ఇథనాల్ పరిశ్రమ విషయంలో మాట్లాడటానికి కేటీఆర్‌కు సిగ్గుండాలని విమర్శించారు. వారి హయాంలోనే ఈ పరిశ్రమకు అనుమతులు ఇచ్చింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని రైతుల మధ్యనే తేల్చుకునేందుకు సిద్ధమా? అని సవాల్ చేశారు. తమ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. నిర్మల్ ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని... బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మవద్దని కోరారు.దిలావర్‌పూర్‌లో పరిస్థితులను పరిశీలించాకే ఇథనాల్ పరిశ్రమ విషయంలో ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువస్తే వాటిని భుజాన మోసింది బీఆర్ఎస్ కాదా? అని నిలదీశారు. వెనుకబడిన లగచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ తెస్తుంటే బీఆర్ఎస్ ఇష్టారీతిన ఆరోపణలు చేస్తోందన్నారు. ఇలాంటి విమర్శలతో బీఆర్ఎస్‌కు తాత్కాలిక ఆనందం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం

- గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, కాలేజీలను పరిశీలించనున్న బీఆర్ఎస్
- గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ
- సీఎం ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోవడం లేదని ఎద్దేవా
- ఆర్ఎస్ ప్రవీణ్ నేతృత్వంలో అధ్యయన కమిటీ వేస్తున్నట్లు వెల్లడి

హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాటకార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా

మిగతా 2 లో..



## హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి వారి ఇళ్లను కూల్చేస్తున్నాడని విమర్శ

- హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఫార్మా పేరుతో భూములు లాక్కుంటున్నారని ఆరోపణ
- మూసీ కంటే ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచన



హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేద, మధ్యతరగతి వర్గాల ఇళ్లను కూల్చేస్తున్నాడని, కానీ కాంగ్రెస్ ఉన్నత వర్గం, వారి బీఆర్ఎస్ మిత్రపక్షం, ఒవైసీ సోదరుల విశాలమైన అక్రమ నిర్మాణాలను, రాజభవనాల వంటి ఫాంహౌస్‌లను మాత్రం కూల్చడం లేదని మాజీ ఎంపీ, బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, భూసేకరణ, రహదారుల పేరుతో ఫార్మా కంపెనీల పేరుతో

మిగతా 2 లో..

## కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదన్న ఆశిష్ దేశ్‌ముఖ్

- మహారాష్ట్రతో పాటు పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ ఓడిందన్న ఎమ్మెల్యే
- కాంగ్రెస్ నుంచి గెలిచిన 16 మంది బీజేపీలో చేరాలని సూచన

మిగతా 2 లో..

# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం

స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు పరిశీలిస్తారు.గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. 11 నెలల్లో 52 మంది విద్యార్థుల మృతి చెందారని, ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో ఈ ముఖ్యమంత్రి విద్యార్థులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కనీసం విద్యాశాఖ మంత్రి లేడన్నారు. అయినా సీఎం ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోవడం లేదని ఎద్దేవా చేశారు.విద్యార్థులు చనిపోతున్నప్పటికీ ఒక్క సమీక్ష నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని హెచ్చరించారు. గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరపున అధ్యయన కమిటీ వేస్తున్నామన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. గురుకులాలను పరిశీలించి ఈ కమిటీ నివేదిక ఇస్తుందన్నారు. ఈ అంశాలను తాము అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు.

---

# హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి వారి ఇళ్లను కూల్చేస్తున్నాడని విమర్శ

మండిపడ్డారు.మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ నిర్వాసితులకు న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో ప్రజలు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మూసీ ప్రక్షాళన చేపట్టినా దానిని పూర్తి చేసేది మాత్రం తమ బీజేపీ ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు.అయితే మూసీ ప్రక్షాళన కంటే ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. కులగణన నివేదిక రాగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో వరుస ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తోందన్నారు. హర్యానా, మహారాష్ట్రలో బీజేపీ సర్వేలకు భిన్నంగా విజయం సాధించిందన్నారు. ఝార?ండ్, జమ్ము కశ్మీర్‌లలో తమకు ఓటు బ్యాంకు పెరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆయా రాష్ట్రాలలో 50 సీట్లు కూడా గెలవలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం లేదని విమర్శించారు.రేవంత్ రెడ్డి డిమోలిషన్ మ్యాన్ అని, అంటే కూల్చివేతల మనిషి అని బూర నర్సయ్య గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ పరిస్థితి పెనం నుంచి పొయ్యి మీద పడినట్లయిందని వ్యాఖ్యానించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలలో గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి... ప్రజలను మోసం చేసిందన్నారు.

---

# కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదన్న ఆశిష్ దేశ్‌ముఖ్



హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలంతా బీజేపీలో చేరాలని ఆ పార్టీ నేత ఆశిష్ దేశ్‌ముఖ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేనందున కమలం గూటికి రావాలని ఆహ్వానించారు. ఈరోజు ఆయన మాట్లాడుతూ... మహారాష్ట్రలో తమ కూటమి అద్భుత విజయం సాధించిందని, ప్రతిపక్ష కూటమి దారుణ పరాజయాన్ని మూటగట్టుకుందన్నారు.కాంగ్రెస్ దారుణ ఓటమిని మనమంతా చూశామని, మహారాష్ట్రలోనే కాదు... చాలా ప్రాంతాల్లో ఆ పార్టీ ఓడిపోవడం మనం చూశామన్నారు. గతంతో పోలిస్తే కాంగ్రెస్ పార్టీకి ఓట్లు, సీట్లు భారీగా తగ్గినట్లు తెలిపారు. ఇక ఆ పార్టీకి భవిష్యత్తు లేదని తేలిందని, ఇంకా అందులోనే ఉంటే గెలిచిన ఎమ్మెల్యేల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అందుకే కాంగ్రెస్ నుంచి గెలిచిన 16 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరాలని సూచించారు.ఆశిష్ దేశ్‌ముఖ్ మాజీ కాంగ్రెస్ నేత. అతనిని కాంగ్రెస్ సస్పెండ్ చేయడంతో... ఆ తర్వాత బీజేపీలో చేరారు. నాగపూర్‌లోని సావ్‌నర్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి 220కి పైగా సీట్లు గెలుచుకుంది.

---

# 9వ అంతస్తు నుంచి పడి మరణించిన ఒడిశా యువతి



హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : ఒడిశాకు చెందిన ఓ మహిళ హైదరాబాదులో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందింది. ఓ అపార్ట్ మెంట్ తొమ్మిదో ఫ్లోర్ నుంచి పడిపోవడంతో ఆమె మరణించింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గంలో ఉన్న మై హోమ్ భూజా అపార్ట్ మెంట్ లో ఈ ఘటన జరిగింది. మృతి చెందిన యువతి పేరు అశ్వితా సింగ్. హైదరాబాద్ కు చెందిన రాజేశ్ బాబు (54), ఆయన భార్య... 25 ఏళ్ల అశ్వితా సింగ్ ను సరోగసీ కోసం హైదరాబాద్ తీసుకువచ్చారు. ఆమె ద్వారా తమ బిడ్డకు జన్మనివ్వాలనేది వారి ఆలోచన. సందీప్ అనే మధ్యవర్తి ద్వారా రూ.10 లక్షలకు ఒప్పందం కుదిరింది. అశ్వితా సింగ్ ను రాజేశ్ బాబు దంపతులు తమ ఫ్లాట్ లోనే ఉంచారు. ఆమె భర్తకు కూడా అదే అపార్ట్ మెంట్ లో మరో ఫ్లాట్ ఇచ్చారు. అయితే, ఆమెను రాజేశ్ బాబు దంపతులు తమ ఫ్లాట్ దాటి బయటకు రానిచ్చేవారు కాదని తెలుస్తోంది. అంతేకాదు, అశ్వితా సింగ్ ను కలిసేందుకు భర్తకు అనుమతి ఇచ్చేవారు కాదు! కాగా, ఆ యువతి ఇంకా గర్భవతి కాలేదు. వచ్చే నెల నుంచి సరోగసీ ప్రక్రియ మొదలుకానుంది. అంతలోనే ఆమె తొమ్మిదో అంతస్తు నుంచి పడిపోయి మృతి చెందడం అనుమానాలకు తావిస్తోంది.దీనిపై అశ్వితా సింగ్ భర్త మాట్లాడుతూ, రాజేశ్ బాబు తన భార్య పట్ల అనుచితంగా ప్రవర్తించేవాడని ఆరోపించాడు. అశ్వితా సింగ్ అతడి ప్రవర్తన భరించలేక, ఆ ఫ్లాట్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించి, ఆ క్రమంలోనే కిందపడిపోయి మరణించి ఉంటుందని భావిస్తున్నారు. బాల్కనీకి రెండు చీరలు, ఒక దుపట్టా ముడి వేసి ఉండడాన్ని గుర్తించారు. కాగా, యువతిని ఆత్మహత్యకు ప్రేరేపించాడన్న ఆరోపణలపై పోలీసులు రాజేశ్ బాబుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నట్టు రాయదుర్గం ఎస్సై వెంకన్న తెలిపారు. ఒడిశా యువతి, ఆమె భర్త ఎప్పటి నుంచి ఆ అపార్ట్ మెంట్ లో ఉంటున్నారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాల్లేవు - భట్టి విక్రమార్క

- మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి
- ప్రతిపక్షాల పసలేని విమర్శలతో ఎలాంటి ప్రయోజనం లేదని వ్యాఖ్య
- మూసీ నిర్వాసితులు వ్యాపారం చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తామని హామీ



హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణలో కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. తమలో విభేదాలు అంటూ పసలేని విమర్శలు చేస్తే ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది కాకుల్లా అరుస్తున్నారని విమర్శించారు. మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా, మూసీ నిర్వాసితులు వ్యాపారాలు చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. హైడ్రా, మూసీ విషయంలో పూర్తిగా ఆలోచించాకే ముందుకు పోతున్నామన్నారు. మూసీ ప్రాజెక్టు విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నేతలు వేలాది ఎకరాలు కాజేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు కాజేసిన భూముల వివరాలను బయటకు తీస్తామన్నారు.

---

# కేటీఆర్ నిర్మల్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- ఇథనాల్ పరిశ్రమకు బీఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతిచ్చిందని వెల్లడి
- ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని కేటీఆర్‌పై ఆగ్రహం
- ఇథనాల్ పరిశ్రమ బీఆర్ఎస్ ముఖ్య నేత కుటుంబానిదేనన్న సీతక్క



హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమకు బీఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని, ఇప్పుడు అబద్ధాలు చెబుతున్న కేటీఆర్ నిర్మల్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. అబద్ధాల పునాదుల మీద తిరిగి అధికారంలోకి రావాలని బీఆర్ఎస్ భావిస్తోందని విమర్శించారు.ఆమె మాట్లాడుతూ... ఇథనాల్ పరిశ్రమ బీఆర్ఎస్ ముఖ్య నేత కుటుంబానికి చెందినదేనని ఆరోపించారు. అందుకే ఈ కంపెనీకి అనుమతులు ఇచ్చింది కూడా గత బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలే అన్నారు. ఈ పరిశ్రమ విషయంలో కుట్రలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు.దీనికి సంబంధించిన కంపెనీలో బీఆర్ఎస్ ముఖ్యనేత కొడుకు, అల్లుడు డైరెక్టర్లుగా ఉన్నారని తెలిపారు. దీనిపై కేటీఆర్ సమాధానం చెప్పాలని నిలదీశారు. ఇథనాల్ ఫ్యాక్టరీపై బీఆర్ఎస్ దొంగనాటకాలు బంద్ చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులిస్తే తమ ప్రభుత్వం నిలిపేసిందన్నారు. కిరాయి మనుషులతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

---

# 35 రైళ్లలో పలు హత్యలు చేసి, దోపిడీకి పాల్పడిన నిందితుడు కరమ్ వీర్



హైదరాబాద్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : 35 రైళ్లలో పలు హత్యలు చేసి దోపిడీకి పాల్పడిన సీరియల్ కిల్లర్ కరమ్ వీర్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేయగా, సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు పీటీ వారెంట్‌పై అతనిని హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. నిందితుడు కరమ్ వీర్ రైల్వే స్టేషన్‌నే స్థావరంగా ఏర్పరుచుకున్నాడు. ఒంటరిగా మహిళలు ఎవరైనా కనిపిస్తే హత్య చేసి దోపిడీ చేయడం అతని నైజం. ఇలాంటి మోస్ట్ వాంటెడ్ కిల్లర్‌ను గుజరాత్‌లోని వల్సాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.ఇటీవల సికింద్రాబాద్‌లోని ఓ రైల్లోని వికలాంగుల పెట్టెలో ఓ మహిళ మృతదేహం కలకలం రేపింది. ఈ హత్య తానే చేసినట్లు నిందితుడు కరమ్ వీర్ ఒప్పుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులకు వల్సాద్ పోలీసులు సమాచారం అందించారు. దీంతో పీటీ వారెంట్‌పై కరమ్ వీర్‌ను హైదరాబాద్‌కి తీసుకొచ్చారు.నిందితుడు కరమ్ వీర్ ఒకచోట హత్య చేసి... దోపిడీకి పాల్పడ్డాక తన స్థావరాన్ని మరోచోటికి మార్చుతాడని వల్సాద్ ఎస్పీ వెల్లడించారు. రైల్వే స్టేషన్ల వద్ద ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేస్తూ దోపిడీ చేసి హత్యలకు పాల్పడినట్లు వెల్లడించారు. 35 రైళ్లలో... ఐదు రాష్ట్రాల్లో ఐదు హత్యలు చేసినట్లు చెప్పారు. కరమ్ వీర్ హర్యానా రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని వెల్లడించారు. రాజస్థాన్, యూపీ, హర్యానా రాష్ట్రాలలో పలు నేరాలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఇప్పుడు రైల్వే సీరియల్ కిల్లర్‌గా మారిపోయాడన్నారు.

# మహర్షి భగీరథుడి విగ్రహాన్ని ఏర్పాటు


**- 3,5 లక్షల సొంత నిధులతో ఎమ్మెల్యే జిఎంఆర్ ఆవిష్కరణ**



గుమ్మడిదల,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మండల పరిధిలోని దోమడుగు గ్రామంలో 3 లక్షల 50 వేల సొంత నిధులతో ఏర్పాటు చేసిన మహర్షి భగీరథుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మండల మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి బుధవారం విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహ దాత ఎమ్మెల్యే జిఎంఆర్ కు షాలువ పూలమాలల్లతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివినుండి భువికి ఆకాశ గంగను తీసుకువచ్చిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో గర్వించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అభిషేట్టి రాజశేఖర్, నారాయణ, ఎండి హుస్సేన్, శేఖర్ సాగర్, మురళీకృష్ణ సాగర్, పెద్ద ఆంజనేయులు సాగర్, గ్రామస్తులు తదితరులున్నారు.

---

## కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సాలగ్రామాల పూజలు



గుమ్మడిదల,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : కార్తీకమాసన్ని పురస్కరించుకొని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహికంగా సాలగ్రామ పూజలను భక్తిశ్రద్ధలతో మహిళలు నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ వంశపారంకులు కె.వి నరసింహ చార్యులు, రంగనాథ చార్యుల ఆధ్వర్యంలో సామూహికంగా సాలగ్రామ, కుంకుమార్చన పూజలను నిర్వహించారు. కార్తీక మాసంలో సాలగ్రామ పూజలను నిర్వహించడం సుఖసంతోషాలను కలిగిస్తాయని ఆలయ వంశ పర్యకులు తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో మహిళల భక్తులు తదితరులున్నారు.

---

## మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం




నర్సాపూర్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : పురపాలక సంఘం కార్యాలయం నందు, ఛైర్పర్సన్ దుర్గప్ప , అశోక్ గౌడ్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఇట్టి సమావేశం యందు వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశంలో భాగంగా హైదరాబాద్ మెదక్ జాతీయ రహదారి మరియు సంగారెడ్డి తూప్రాన్ రహదారి రోడ్డు పరిధిలో ఫుట్ పాత్ ఆక్రమించి ఏర్పాటుచేసిన ఆక్రమణలను తొలగించుటకుగాను సమావేశము ఏకగ్రీవంగా తీర్మానం చేయనైనది. ఇట్టి కార్యక్రమంలో మంచినీటి సరఫరా, వీధి దీపముల నిర్వహణ, వివిధ అభివృద్ధి పనులు మరియు ఇతర అంశములపై చర్చించదమైనది. ఇట్టి సమావేశంలో మున్సిపల్ కమిషనర్, పి రామకృష్ణ రావు, వైస్ చైర్పర్సన్ ఎండి నైముద్దీన్ కౌన్సిలర్లు, ఇశ్రత్ సిద్ధిక, ఎరుకల యాదగిరి, సంగసాని సురేష్, గొల్ల రుక్కమ్మ, పంబల్ల రామచందర్, వంటేద్దు సునీత, వనముల బుచ్చేష్ యాదవ్, గోడ రాజేందర్, చెలిమేటి లక్ష్మి, తంగేడుపల్లి సరిత , పంబల్ల లలిత పురపాలిక మేనేజర్ శ్రీ వి మధుసూదన్, వివిధ శాఖల అధికారులు మరియు పురపాలక సిబ్బంది పాల్గొనడం జరిగింది.

---

## కేజీబీవీ, సర్వ శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలి

**- యూటీఎఫ్ నర్సాపూర్ మండల శాఖ డిమాండ్**



నర్సాపూర్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం (మినిమం టైమ్ స్కేల్) అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నర్సాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి, గంగాధర్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కేజీబీవీ చెప్పల్దుర్తిలో నల్ల బ్యాడ్జీలు, ప్లే కార్డులు ధరించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నర్సాపూర్ మండల అధ్యక్షులు రవి మాట్లాడుతూ ఉద్యోగులకు చాలిచాలని జీతాలతో జీవితాలు గడుపడం రోజు రోజుకు భారమవుతుందని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అందుకుంటున్నాయని, పని భారం ఎక్కువ అవుతున్నా జీతాలు పెరుగటం లేదని ఉపాధ్యాయులు ఉద్యోగులు వాపోతున్నారన్నారు. టిఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త దశలవారీ పోరాటం చేపట్టుతున్నామని, ఏళ్ల తరబడి తక్కువ వేతనంతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని, ఉపాధ్యాయులు శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

---

## కుటుంబ సంక్షేమంపై ప్రాథమిక ఆరోగ్య వైద్య కర దీపిక



సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : కలెక్టర్ చేతుల మీదుగా ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమంపై ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారులకు సంబంధించిన కరదీపికను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కరదీపికని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు జిల్లా అధికారులకు ఇవ్వడం జరుగుతుంది. ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమానికి సంబంధించిన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన కుటుంబ సంక్షేమం, జాతీయ ఆరోగ్య మిషన్ , జనని సురక్ష యోజన, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సేవలు, ఆహారం మరియు ఆరోగ్యం, హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నిరోధక కార్యక్రమాలు, ఊపిరితిత్తుల వ్యాధులకు, చిన్నపిల్లలు చిన్నపిల్లల వ్యాధులకు సంబంధించిన, పరిసరాల పరిశుభ్రత, ఉదరకోశ వ్యాధులు, కీటకాల ద్వారా వ్యాపించు వ్యాధులు, రేబిస్ వ్యాధి, క్యాన్సర్, దంతవ్యాధులు, ప్రథమ చికిత్స, యోగ మొదలైనవి ఆరోగ్యానికి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి గాయత్రి దేవి, డాక్టర్ శశాంక్ డి ఐ ఓ, ఎం ప్రసాద్ డెమో, రవి, శశి మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

---

# పలుగు పోచమ్మ తల్లి ఆలయం వద్ద విచ్చలవిడిగా కల్లు దుకాణాలు

**- మందుబాబుల వికృతి చేష్టలతో విసిగిపోతున్న భక్తులు పట్టించుకోని అధికారులు**





హత్నూర,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని శేర్ ఖాన్ పల్లి గ్రామ శివారులో వెలసిన శ్రీ శ్రీ పలుగు పోచమ్మ ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా వేసిన భారీ షెడ్లలో మద్యం కల్లు అమ్మకాలతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొన్నారు.భక్తులతో కిటకిటలాడే పలుగు పోచమ్మ ఆలయం వద్ద విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన కల్లు దుకాణాలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీ షెడ్లు వేసి కల్లుతో పాటు మద్యం అమ్మడం రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్ తో వచ్చిపోయే భక్తులకు వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మందుబాబుల వికృత చేష్టలకు భక్తులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. మందుబాబులు రోడ్డుపైనే కార్లు పార్కింగ్ చేయడం పక్కకు తీయాలి అంటే దాడులు చేస్తున్నారని... ఇలాంటి సంఘటనల వల్ల ఆర్టీసీ బస్సులు అటువైపు నుంచి నడపడం బందు చేశారని స్థానికులు పేర్కొంటున్నారు. ఆఫీసర్లు, ఆలయ నిర్వాహకులు కల్పించుకొని ఆలయం దగ్గర ఎదురుగా ఉన్న దుకాణాలను తొలగించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు... ఎక్సైజ్ ఆఫీసర్లు తక్షణమే స్పందించి కల్లు దుకాణాలను తొలగించాలని ఆలయ ప్రతిష్టను దెబ్బతీయకుండా చూడాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. విచ్చలవిడి కళ్ళు దుకాణాలపై వివరణ కోరేందుకు అందోల్ ఎక్సైజ్ సీఐ ఫోన్ నెంబర్ సంప్రదించగా... ఫోన్ లేపడం లేదు.

---

# నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలి

**- సీపీఐఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి**
**- విరివిగా విరాళాలు ఇవ్వండి**
**- సీపీఐఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**





సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఐఎం రాష్ట్ర నాలుగవ మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రం లో ఇంటింటికి సీపీఐఎం పేరుతో ప్రజల వద్ద నుంచి బుధవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న సీపీఐఎం రాష్ట్ర మహాసభలను మొదటి సారి సంగారెడ్డిలో జరగనున్నాయని అన్నారు. మహాసభలను విజయవంతం చేయడం కోసం సంగారెడ్డి జిల్లా ప్రజానీకం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం పెరుగతున్న నిత్యావసర ధరలు తగ్గించాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. జిల్లాలో సింగూర్ జలాలు తాగుకు, సాగుకు జిల్లాకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగూరు జలాల సాధన కోసం సీపీఐఎం పోరాటం చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లాలో సింగూరు. జలాలు సాగుకు ఇవ్వకపోవడం వలన వలసలు పెరిగాయన్నారు. పత్తికి మద్దతు ధర ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్లు కొనుగోలు వెంటనే ప్రారంభించాలన్నారు. మండలంలో అసైన్మెంట్ భూములకు పట్టా సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల ఇళ్ల స్థలాలు సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. నరసింలు,నాయకులు అశోక్ మహేష్ రమేష్ గౌడ్,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

---

# చెరువులు కుంటలను కాపాడటమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తుంది



రామచంద్రాపురం,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మేళ్లచెరువు, ఉస్మాన్ నగర్ లోని చెలికుంట చెరువులను బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించారు. మేళ్ల చెరువు కబ్జాకు గురవుతుందని కొందరు స్థానికులు హైడ్రా దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం సాయంత్రం మేళ్ల చెరువును సందర్శించారు. కబ్జాకు గురైన చెరువులను కాపాడతామని రంగనాథ్ తెలిపారు. చెరువు పరిధిని పూర్తి సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించి చర్యలు తీసుకుంటామని

# డైల్ 100 కాల్స్ పైన నిర్లక్ష్యం చేస్తే కఠినమైనా చర్యలు

**- జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి**






వికారాబాద్ స్టాఫ్ రిపోర్టర్,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి బుధవారం జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు పోలీస్ అధికారులు పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలని, కేసులను ఎప్పటికప్పుడు ఆన్లైన్ నందు నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి కంప్లైంట్ తో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. ప్రజలకు పోలీస్ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని,. సీసీటీవీ ల పైన ప్రజలలో అవగాహనా పెంచి, సీసీటీవీ ల ఏర్పాటు చేసిన సీసీటీవీ ల పైన ప్రత్యేక నిఘా పెట్టిలన్నారు. డైల్ 100 ద్వారా వచ్చే పిర్యాదుల పట్ల ఎవరు కూడా నిర్లక్ష్యం వహించకూడదన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వర్టికల్స్ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలాని, పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ లు చేసి మంచి కండిషన్ లో పెట్టుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ కేసులకు సంబంధించిన ఫైల్స్ పరిశీలించారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, పరిగి, వికారాబాద్, తాండూర్ ఎఆర్, డిఎస్పీ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు,ఆర్ఐ లు, ఇన్స్పెక్టర్ లు, ఎస్సై లు, ఆర్ఎస్ఐ లు తదితరులు పాల్గొన్నారు.

---

# రోడ్డు ప్రమాదం లో ఇద్దరు మృతి




అల్లదుర్గం,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : హైదరాబాద్ నుండి బోధనకు వెళ్తుండగా ఎన్ హెచ్ 161 అల్లాదుర్గం వద్దకు రాగానే ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ వివరాన గురించి చంద్రశేఖర్ %ూ/శీ% శివరాజ్ వృత్తి మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ %=/శీ% బోధన్ విలేజ్ అండ్ మండల్ నిజామాబాద్ జిల్లా ఇచ్చిన ఫిర్యాదు ఏమనగా బుధవా రం ఉదయం పండగ 10 గంటలకు తన తమ్ముడు అయిన రాజశేఖర్ మరియు తన తండ్రి శివరాజ్ తన తల్లి లక్ష్మీబాయి తమ్ముడి భార్య అరుణ వారి కూతురు అనన్య అందరు కలిసి హైదరాబాద్ నుండి బోధనకు రాజశేఖర్ యొక్క కారులో వెళ్తుండగా అందాజా సమయం మధ్యాహ్నం 1:00 సమయంలో అల్లాదుర్ వద్దకు రాగానే ఎన్ హెచ్ 161 పైన బ్రిడ్జికి వేగంగా వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొనడంతో కారు నడుపుతున్న రాజశేఖర్ కి కార్లో ప్రయాణిస్తున్న వారికి గాయాలు అవడంతో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ లో తరలించడం జరిగింది. జోగిపేట ఆస్పత్రిలో రాజశేఖర్ మరణించారు. మిగతా వారిని మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందుతూ రాజశేఖర్ తండ్రి శివరాజ్ మరణించారు. చంద్రశేఖర్ ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

---

# తల్లి కొడుకుల ప్రాణం తీసిన పెద్దల పంచాయితీ



జోగిపేట,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : అందోలు మండలం చింతకుంట మంజీరా నదిలో దూకి తల్లి, కొడుకుల అత్మహత్యకు పాల్పడిన ఘటనలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. గ్రామానికి చెందిన వడ్ల శ్యామ్, అతని తల్లి వడ్ల బాలమణీలు మంగళవారం సాయంత్రం మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం మృతుని తండ్రి యాదయ్య జోగిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన వివరాలు మృతుని తండ్రి వడ్ల యాదగిరి ఫిర్యాదు మేరకు సీఐ అనిల్కుమార్ తెలిపిన ప్రకారం ఈ విధంగా ఉన్నాయి. ఈ నెల 24వ తేదీన (ఆదివారం) చింతకుంటకు చెందిన చాంద్పాషా ఇంట్లో జరిగిన విందుకు సంగారెడ్డికి చెందిన బంధువులు టాటా ఏసీ ఆటోలో హాజరుకాగా, అదే రోజు రాత్రి ఆటో కనిపించలేదు. గ్రామానికి చెందిన వడ్ల శ్యామ్ ఆటోను ఎత్తుకేళ్లాడని సోమవారం చింతకుంట గ్రామ పెద్దలకు తెలియజేశారు. దీంతో గ్రామ పెద్దలు మంగళవారం వడ్ల శ్యామ్ కుటుంబీకులను పిలిపించి పంచాయితీ నిర్వహించారు. ఆటోను చోరీకి పాల్పడినందుకు గాను గ్రామ పెద్దలు రూ.5 లక్షల జరిమానాను చెల్లించాలంటూ వడ్ల శ్యామ్, అతని కుటుంబీకులపై ఒత్తిడి తీసుకొచ్చారని పెర్కోన్నారు. జరిమానాను చెల్లించలేని పరిస్థితుల్లో ఉండడంతో పాటు గ్రామంలో పరువు పోయిందని భావించి వడ్ల శ్యామ్ (21) అతని తల్లి వడ్ల బాలమణి(45)లు తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం చింతకుంట వద్ద మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు మృతుని తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.


# ట్రాన్స్‌జెండర్ల లకు ప్రత్యేక న్యాయ అవగాహనా సదస్సు




సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల మేరకు బుధవారం న్యాయ సేవా సదన్ సంగారెడ్డి, సంగారెడ్డి జిల్లా నందు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ల లకు ప్రత్యేక న్యాయ అవగాహనా సదస్సులు నిర్వహించారు. న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలి అన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాలలని అన్నారు. న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలో చక్కగా చెప్పారు. వారి పట్ల ఉన్న హక్కులను వివరించారు. లింగమార్పిడి వ్యక్తిని పుట్టినప్పుడు కేటాయించిన లింగంతో సరిపోలని వ్యక్తిగా నిర్వచిస్తుంది. ఇందులో ట్రాన్స్-మెన్ మరియు ట్రాన్స్-ఉమెన్, ఇంటర్‌సెక్స్ వైవిధ్యాలు ఉన్న వ్యక్తులు, లింగ-క్వీయర్‌లు మరియు కిన్నార్ మరియు హిజ్రా వంటి సామాజిక-సాంస్కృతిక గుర్తింపులు ఉన్న వ్యక్తులు ఉన్నారు. ఇంటర్‌సెక్స్ వైవిధ్యాలు అంటే పుట్టినప్పుడు అతని లేదా ఆమె ప్రాథమిక లైంగిక లక్షణాలు, బాహ్య జననేంద్రియాలు, క్రోమోజోమ్‌లు లేదా మగ లేదా స్త్రీ శరీరం యొక్క సాధారణ ప్రమాణం నుండి హార్మోన్లలో వైవిధ్యాన్ని చూపించే వ్యక్తి అని అర్థం. వివక్షకు గురి కాకుండా ఇలాంటి వాటి మీద అవగహన కలిగి ఉండాలి అన్నారు. i విద్యబీ (ii) ఉపాధిబీ (iii) ఆరోగ్య సంరక్షణబీ (iv) ప్రజలకు అందుబాటులో ఉన్న వస్తువులు, సౌకర్యాలు,అవకాశాలను యాక్సెస్ చేయడం లేదా అనుభవించడంబీ (v) ఉద్యమం హక్కుబీ vi) నివాసం, అద్దెకు లేదా ఆస్తిని ఆక్రమించే హక్కుబీ (vii ప్రభుత్వ లేదా ప్రైవేట్ కార్యాలయాన్ని నిర్వహించే అవకాశంబీ మరియు (viii) లింగమార్పిడి వ్యక్తి సంరక్షణ. న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలరు. ఈ సదస్సు నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ పోలీస్ శాఖ అధికారులు, సంక్షేమ శాఖాధికారి, పారా లీగల్ వాలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

---

# మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ప్రజా,సామాజిక సమస్యలపై పోరాడుతాం




సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మహాత్మ జ్యోతిరావు పూలే గారి 134వ వర్ధంతి సందర్భంగా నిన్న సంగారెడ్డి లోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. అంటరాని తల నిర్మూలన కోసం, సామాజిక న్యాయం కోసం, ఆత్మగౌరవం కోసం, పోరాడిన గొప్ప ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు, స్త్రీల హక్కుల కోసం, అందరికీ విద్య అందాలనే సదుద్దేశంతోటి, తన భార్యకు చదువు చెప్పి మహిళాఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దయిన గొప్ప సంఘసంస్కర్త మాత్మ జ్యోతిరావు పూలే అని వారు గుర్తు చేశారు. నేటికీ ఇంకా అణచివేతకు ఆత్మగౌరవానికి గురవుతున్నారని వాటికి వ్యతిరేకంగా మాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రాబోయే రోజులలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నర్సింలు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, నాయకులు అర్జున్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.




Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com